క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ ఎ.సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బోయిపాలెం, గంభీరం, కల్లివానిపాలెం, ఏపీఐఐసీ ఏరియా, వెల్లంకి, బొడ్డపాలెం, గారిపేట గ్రామాల్లోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈఈ సురేష్ కుమార్ ఈ సందర్భంగా కోరారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ తల్లి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ గ్రామ దేవత శ్రీ బంగారమ్మతల్లికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పూజల్లో స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో కథాపఠనం



పుస్తక పఠనంలో విద్యార్థులు

ఆనందపురం: స్థానిక గ్రంథాలయ శాఖలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులచే కథాపఠనం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘ సేవకుడు రామారావు పలు కథలు చదివి వినిపించారు. విద్యార్థులచే కొన్ని కథలు చదివించి అందులో గల మంచి విషయాలు వివరించారు. మ్యాజిక్ బస్ ఆర్గనైజేషన్ యూత్ మెంటార్ కె.రమణమ్మ పాటలతో ఆటలు ఆడించి శరీర పరిశుభ్రత, క్రిముల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బీవీఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనిట్స్ విద్యార్థిని మహతికి అభినందనలు



మహతిని అభినందిస్తున్న శ్రీరామకృష్ణ

తగరపువలస: తిరుపతిలో ఈ నెల 1 నుంచి 5 వరకు నిర్వహించిన ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో సంగివలస అనిట్స్ విద్యార్థిని ఆర్.మహతి రన్నర్‌గా నిలిచారు. ఫస్టియర్ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఈమెను గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, సీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణమూర్తి, క్రీడాదర్శకుడు కె.వేణుగోపాల్ అభినందించారు.

బావిపై రక్షణగా గ్రిల్స్ ఏర్పాటు



నేల బావిపై ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జేకే కాలనీలో రక్షణ లేని నేల బావిపై జీవీఎంసీ అధికారులు ఐరన్ గ్రిల్స్ వేయించారు. నూతిని శుభ్రం చేయించడం, గ్రిల్స్ ఏర్పాటు పనులను జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి గురువారం పర్యవేక్షించారు. కొత్త కాలనీలోని 145వ బ్లాకు వద్ద రక్షణ లేకుండా ఉన్న సామాజిక బావి భయం గొల్పుతుండేది. ఈ ఇబ్బందులపై 'భయపెడుతున్న బావి' శీర్షికన ఈ నెల 6న సాక్షి పత్రికలో వార్త ప్రచురితమయింది. దీనిపై జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి స్పందించారు. బావిపై ఇనుప గ్రిల్స్‌తో తయారు చేసిన పైకప్పు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారుల కల సాకారం..!



భీమిలి తీరంలో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలం



ప్రస్తుతం తీరంలో భద్రత లేకుండా నిలిపి ఉంచిన పడవలు, తెప్పలు

- ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన
- పడవల భద్రత, చేపల ఎగుమతికి ఎంతో ప్రయోజనం
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుకున్న మత్స్యకారులు

భీమునిపట్నం: ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్న కల కార్యరూపం దాల్చే రోజు రానుండడంతో భీమిలిలోని మత్స్యకారుల ఆనందానికి హద్దు లేకుండా పోయింది. వారికి ఎంతో అవసరమైన ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేయడంతో త్వరలో అది అందుబాటులోకి రానుంది. ఇక్కడి బోయివీధి, ఎగువపేట, తోట వీధి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మత్స్యకారులు నివాసముంటుండగా వారిలో ఎక్కువ మంది చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రోజూ సుమారు 200లకు పైనే పడవలు, తెప్పలతో సముద్రంలోకి చేపల వేటకు వెళ్తుంటారు. అయితే వీరు ఎంతో కష్టపడి వేటాడి తీసుకొస్తున్న చేపలను ఎగుమతి చేసుకోవడానికి సదుపాయం లేదు. ముఖ్యంగా పడవలు, తెప్పలను సురక్షితంగా భద్రపరచుకునే వీలు లేదు. దీంతో తీరంలో నీటి దగ్గరలోనే ఉంచాల్సి వస్తోంది. దీనివల్ల సముద్రంలో ఆటుపోట్లు వచ్చే సమయాల్లో, తుఫాన్‌లు సంభవించినప్పుడు అలల ధాటికి చాలా వరకు పడవలు, తెప్పలు కొట్టుకుపోవడంతోపాటు బాగా దెబ్బతింటున్నాయి, ఫలితంగా మత్స్యకారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. గత ప్రభుత్వం ఈ విషయంలో మంచి చేస్తామని చెప్పి ఏమీ చేయకుండా మోసం చేసింది.

సీఎం జగన్ ప్రత్యేక దృష్టితో...

స్థానిక మత్స్యకారుల పరిస్థితి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని అన్ని సదుపాయాలతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ మంజూరు చేశారు. అలా చేయడమే కాకుండా జాప్యం జరగకుండా నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన కూడా చేశారు. తీరంలోని సాగర సంగమం సమీపంలో రూ.28.7 కోట్లతో నిర్మాణం జరగనుంది. ప్రధానంగా మత్స్యకారుల పడవలు, తెప్పలను సురక్షితంగా భద్రపరచుకోవడానికి సదుపాయాలు కల్పిస్తారు. తద్వారా వారికి ఆర్థికంగా నష్టం జరగదు. అలాగే వేటాడి తీసుకొచ్చే చేపలను ఎగుమతి చేసుకోవడానికి పెద్ద షెడ్లు, సిమెంట్ ప్లాట్‌ఫారాలు నిర్మించనున్నారు. పడవలు, తెప్పలు, వలలు మరమ్మతులు చేసుకోవడానికి అన్ని వసతులు సమకూర్చనున్నారు. వీటితోపాటు అవసరమైన ఇతర ఏర్పాట్లు చేయనున్నారు.

సీఎం జగన్ దయవల్లే..



సీఎం వైఎస్ జగన్ తమకు ఇబ్బందులు, కష్టాలు ఉంటాయని గుర్తించారు. వాటిని పరిష్కరిస్తే మా జీవితాలు బాగుంటాయన్న ఉద్దేశంతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను అందిస్తున్నారు. ఆయన దయవల్లే ఇది మాకు అందుబాటులోకి రానుండడం చాలా ఆనందంగా ఉంది.

–కాసరపు దుర్గారావు, మత్స్యకారుడు, భీమిలి

నష్టపోయే పరిస్థితులు ఉండవు



ఇప్పటి వరకు తీరంలోని పడవలు, తెప్పలు, వలలకు రక్షణ లేకపోవడంతో అలల ఉధృతి వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం వల్ల పూర్తి భద్రత ఏర్పడుతుంది. ఫలితంగా ఆర్థిక నష్టాలు తప్పి అందరికీ ఎంతో మేలు జరుగుతుంది.

– కొక్కిరి ఎల్లాజీ, మత్స్యకారుడు, భీమిలి

మత్స్యకారులకు ఎంతో మేలు



ఫిష్ ల్యాండింగ్ సెంటర్ అందుబాటులోకి వస్తే మత్స్యకారులు అందరికీ ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల నష్టాలు వాటిల్లక పోవడమే కాకుండా చేపలను మంచి పద్ధతిలో ఎగుమతి చేసుకునే వీలు లభిస్తుంది. మంచి లాభాలు కూడా వస్తాయి. అన్ని విధాలుగా బాగుంటుంది.

– తెడ్డు రాందాసు, మత్స్యకారుడు, భీమిలి

మళ్లీ మీరే సీఎం కావాలి

- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో వైఎస్సార్ సీపీ భీమిలి నాయకులు
- పీఎం పాలెం ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆత్మీయ సమావేశం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

మధురవాడ: 'మీరు పరిపాలిస్తున్నది మనుషులను కాదు... వారి మనసులను... రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం మళ్లీ మీరే సీఎం కావాలి... అందుకోసం మీ వెంటే మేమంతా నడుస్తాం...' అని భీమిలి నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఉత్సాహంగా అన్నారు. పీఎం పాలెంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ – వీడీసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వద్ద వైఎస్సార్ విగ్రహావిష్కరణకు గురువారం విచ్చేసిన సీఎం జగన్ భీమిలి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇందులో భాగంగా పలువురు ఆయన దష్టికి పలు విషయాలు తీసుకొచ్చారు.

- ప్రజల మనసులు పరిపాలిస్తున్న మీరే మళ్లీ సీఎం కావాలని ఎండాడకి చెందిన ముస్తాఫా ముఖ్యమంత్రి జగన్‌కు కిరీటం బహూకరించగా ఆయన ధరించారు.
- భీమిలి మార్కెట్ కమిటీ భవనం శిథిలావస్థలో ఉందని, ఈ విషయం మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామని, జీవీఎంసీ అధికారులు కూడా ఆ స్థలం తమదని చెబుతున్నారని... ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, డైరెక్టర్లు జేఎస్ రెడ్డి, చిల్ల హరిరెడ్డి తదితరులు కోరారు.
- జీవీఎంసీ 6వ వార్డులో అపరిష్కృతంగా ఉండిపోయిన రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు సమస్య పరిష్కరించాలని పిల్లా రమణ, వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు కోరారు.
- ఒకప్పుడు ఎస్సీ కాలనీలు ఊరికి చివరన ఉండేవని.. ఇప్పుడు బీసీలు, ఇతర బడుగు బలహీనవర్గాలతో కలిపి జగనన్న కాలనీలు నిర్మిస్తున్నారని... మీ పెద్ద మనసుకి ధన్యవాదాలంటూ భీమిలి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సియాద్రి కనకరాజు అన్నారు.
- జీవీఎంసీ 3వ వార్డులో మత్స్యకార యువకులు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారని, వారికి ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాలని జి.మధునాయుడు కోరారు.
- అనంత పద్మనాభ స్వామి ఆలయం ఘాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, 2వ పీహెచ్‌సీ నిర్మాణం, పాండ్రంగి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని పద్మనాభం ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, కోరాడ లక్ష్మణరావు తదితరులు కోరారు.
- ఆనందపురం మండలం జగన్నాథపురం గ్రామంలో గ్రేహౌండ్స్ కోసం ప్రభుత్వం 300 ఎకరాలు స్థలం తీసుకుందని, ఇందులో రైతుల స్వాధీనంలో ఉన్న 150 ఎకరాలు భూమి ఉందన్నారు. దీనికి ప్రభుత్వం ఇస్తానన్న రూ. 13.50 కోట్లలో రూ.8 కోట్లు మాత్రమే ఇచ్చారని, మిగిలి మొత్తం ఇప్పించాలని వైఎస్సార్‌సీపీ ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యనారాయణ కోరారు.
- ఆనందపురం మండలం కణమాంలో ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా 150 ఎకరాలు సేకరించిందని, వారికి పరిహారం ఇవ్వాలని, స్థానిక యువతకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని పినిశెట్టి సింహాచలం నాయుడు తదితరులు కోరగా... వారం రోజుల్లో రూ.34 కోట్లు ఇస్తామని సీఎం జగన్ చెప్పారని వారు తెలిపారు.

థ్యాంక్యూ సీఎం సర్

సింహాచలం పంచ గ్రామాల సమస్య పరిష్కారం కోసం 250 ఎకరాలు జీవీఎంసీ భూమి కేటాయించారని, దాని విలువ రూ.1919 కోట్ల వరకు ఉంటుందని, ఎప్పటికీ ఈ ప్రాంత ప్రజలు మీకు రుణపడి ఉంటారని 98వ వార్డు నాయకులు ఎర్ర వరహా నరసింహం, 98వ వార్డు అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, నాయకులు పీతల అప్పలరాజు, లెంక సత్తిబాబు, కర్రి సత్తిబాబు, కరణం కష్టారావు తదితరులు సీఎం జగన్‌తో అన్నారు. ముత్తంశెట్టి నందేశ్, కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతురావు, శ్రీకాంత్ రాజు, డాక్టర్ గాదే రోశిరెడ్డి, రాజేశ్వరి, పలువురు ప్రజా ప్రతినిధులు సీఎం జగన్‌ను కలిశారు.

గంగాధరరెడ్డికి ఘన నివాళి



గంగాధరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షుడు సబ్బెళ్ల గంగాధరరెడ్డి చిత్రపటానికి చిట్టివలస కార్యాలయంలో గురువారం పలువురు నివాళులర్పించారు. నీలాపు శంకరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నుంచి ప్రారంభమైన గంగాధరరెడ్డి చిట్టివలస జ్యూట్‌మిల్లులోనే కాకుండా ఉత్తరాంధ్రలోని బీహెచ్‌పీవీ, ఎల్‌జీ పాలిమర్స్, జింక్ పరిశ్రమల్లో కార్మికుల హక్కులు సాధించారన్నారు. 1979లో ప్రధాన కార్యదర్శి చిల్ల శంకరరెడ్డి సహా 200 మంది కార్మికులను జైలు శిక్ష నుంచి రక్షించారన్నారు. నాయకులు దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, చిల్ల ఆదినారాయణరెడ్డి, సరగడ ఈశ్వరరావు, తమ్మిన కూర్మారావు, బోర రామారావు, జి.రమణ, వై.అప్పలరెడ్డి, తమ్మిన విజయ్, సీహెచ్ వెంకటరావు, ఎన్.సూర్యనారాయణ, యు.అప్పలనరసయ్య పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు మరమ్మతులకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు శ్రీనగర్ కాలనీలో రూ.5 లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాలు మరమ్మతులకు పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు గురువారం భూమి పూజ చేశారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి కమ్యూనిటీ హాలు మరమ్మతుల విషయాన్ని స్థానికులు తీసుకెళ్లగా... ఆయన నిధులు మంజూరు చేయించారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ ఎస్.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, సిమ్మల ప్రసన్న, పందిరి విజయ్, జీరు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే దోమల నియంత్రణ



మాట్లాడుతున్న మలేరియా నివారణ అధికారి మణి

భీమునిపట్నం: దోమల వల్ల డెంగ్యూ, మలేరియా ప్రబలుతాయని, అందువల్ల అవి వ్యాప్తి చెందకుండా అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి మణి అన్నారు. దోమల వ్యాప్తి వల్ల కలిగే అనర్థాలపై స్థానిక మండల సమాఖ్య కార్యాలయం వద్ద గ్రామ మహిళ సంఘాల సహాయకుల(వీవోఏ)తో గురువారం అవగాహన కల్పించారు. ఇళ్లల్లోని ఫ్రిజ్‌ల వెనుక భాగంలోని నీరు నిల్వ లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జాగ్రత్తలు తీసుకోకపోతే డెంగ్యూ, మలేరియాతోపాటు మరి కొన్ని వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో ఆయా గ్రామాల్లో మహిళలందరికీ అవగాహన కల్పించాలని కోరారు.

మధురవాడ: వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి సూచించారు. మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా తదితర వ్యాధులు, ఆరోగ్య పరిరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు సబ్బు, ప్లాస్టిక్ టబ్బు, టవల్, అయింట్మెంట్, మగ్గు తదితర వస్తువులతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, వైద్యులు ప్రశాంతి, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం నేడు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం శుక్రవారం ప్రారంభమవుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ కేంద్రాన్ని ఉదయం పది గంటలకు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

విద్యార్థులకు ధ్రువపత్రాల అందజేత



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అచ్చిబాబు తదితరులు

ఆనందపురం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఆనందపురంలో నిర్వహించిన ఉచిత శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు గురువారం నిర్వాహకులు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర ఎస్ఎఫ్‌డీ కో – కన్వీనర్ లొడగల అచ్చిబాబు మాట్లాడుతూ పేద విద్యార్థులకు 41 రోజులు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచితంగా శిక్షణ అందించామని చెప్పారు. ఈ రెండు కోర్సులు ద్వారా నేర్చుకున్న విజ్ఞానం ఉపాధి అవకాశాల ప్రయత్నంలో ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా 40 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామకృష్ణ, ముద్దాడ వెంకటేష్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రంగ ప్రగతిలో నాస్కామ్ పాత్ర కీలకం



హరీష్ మెహతాను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: గడిచిన 30 సంవత్సరాల్లో దేశంలో ఐటీ రంగాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రగతి పథంలోకి నడిపించడంలో నాస్కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్) కీలక పాత్ర పోషించిందని నాస్కామ్ సహ వ్యవస్థాపకుడు హరీష్ మెహతా పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం, ఐటీ రంగం విధాన నిర్ణయాలు తీసుకోవడంలో వారధిగా నిలిచిందన్నారు. నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా గురువారం ఆయన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఐటీ రంగం ప్రయోజనాలపై దశాబ్దాల కిందటే ప్రభుత్వాలకు నాస్కామ్ వివరించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొమ్మాది: రహదారి భద్రతపై యువతలో, విద్యార్థుల్లో అవగాహన కలిగించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, జాతీయ సేవా పథకం వలంటీర్ల ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీని గీతం మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర ప్రారంభించారు. రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో యువత అధికంగా ఉంటున్నారని, మితిమీరిన వేగమే ఇందుకు కారణమన్నారు. రహదారి నిబంధనలు పాటించడంతోపాటు హెల్మెట్‌ధారణ, ప్రయాణాల్లో సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బాబయ్యరెడ్డి, వెంకటరెడ్డి

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు జీరుపేటలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, జీరు వెంకటరెడ్డి గురువారం భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో ఎట్టకేలకు మారుమూల ప్రాంతాలకు వసతులు కల్పించగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో చిల్ల గణేష్ రెడ్డి, వెంపాడ వెంకట రమణా రెడ్డి, జీరు వేణుగోపాల రెడ్డి, డెక్కతి ధన, కొల్లి గోపాల్ రెడ్డి, వలంటీర్ చిల్ల త్రినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15వ నంబర్ రేషన్ డిపోపై 6ఎ కేసు

తగరపువలస: స్థానిక సంతబయలు రహదారిలో 15వ నంబర్ రేషన్ డిపోలో 30 కిలోల బియ్యం తేడా ఉండటంతో డీలర్ ఉప్పల చిన వెంకటరమణకు 6ఎ నోటీసు జారీ చేసినట్టు భీమిలి పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారావు తెలిపారు. ఇటీవల డీలర్ పెద్ద కుమారుడు ఉప్పల రమేష్‌బాబు రేషన్ డిపో చిరునామాలో తేడా ఉందంటూ పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ రాణి సుష్మిత ఈ నెల 9న తనిఖీ చేశారు. ఆ సమయంలో ఈ పాస్ యంత్రంలో బియ్యం నిల్వలను భౌతికంగా ఉన్న నిల్వలతో పోల్చి చూడగా 992 కిలోలు తేడా ఉన్నట్టు గుర్తించారు. కానీ 2021 సెప్టెంబరులోనే 1025 కిలోల బియ్యం తేడా ఉన్నట్టు డీలర్ పౌరసరఫరాల అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు తెలియజేశారు. దీనిపై డిప్యూటీ కలెక్టర్ విచారణ చేపడతామని హామీ ఇచ్చారని డీలర్ తెలిపారు. మళ్లీ గురువారం సీఎస్‌డీటీ కృష్ణారావు డిపోలో బియ్యం నిల్వలను ఈ పాస్ యంత్రంతో పోల్చి చూడగా 30 కిలోలు తక్కువగా కనిపించింది. ఈ మేరకు 6ఎ నోటీసు ఇచ్చి డిపోలో ఉన్న సరకులు, కాటా, ఈ పాస్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

200 మందికి కంటి పరీక్షలు

మధురవాడ: మే డే ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 7వ వార్డు నగరంపాలెం రోడ్డులోని మధురవాడ వేంకటేశ్వర విద్యాపీఠ్ స్కూల్‌లో సీఐటీయూ, డీవైఎఫ్ఐ సంయుక్తంగా గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వై.వెంకటేశ్వరరావు, రాజ్ కుమార్, రాజు, శ్రీనివాస్ వర్మ, ఇందు, భారతి, రంగమ్మ, శంకర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఎ.రాజు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ సంస్థతో శ్రీ కృష్ణా కళాశాల ఒప్పందం

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల యాజమాన్యం ఏయిరీస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సంస్థతో గురువారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఫైనలియర్ విద్యార్థుల ఉద్యోగ, ఉపాధి అవకాశాల నిమిత్తం కంప్యూటర్ కోర్సులు, జావా సిలబస్‌లో శిక్షణ కోసం ఈ ఒప్పందం చేసుకున్నట్టు కళాశాల కరస్పాండెంట్ బి.నరసింగరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సతీష్‌కుమార్, సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాయింట్ రీ సర్వే చేయాలని వినతి



తహసీల్దార్ శ్రీవల్లీకి వినతిపత్రం ఇస్తున్న పెదరావుపల్లి ప్రజలు

పద్మనాభం: తమ భూములకు జాయింట్ రీసర్వే చేయాలని విజయనగరం జిల్లా కొత్తవలస మండలం పెదరావుపల్లి గ్రామ ప్రజలు గురువారం తహసీల్దార్ తోట శ్రీవల్లీకి వినతిపత్రం ఇచ్చారు. పెదరావుపల్లిలో 1902లో చేసిన సర్వేలో పెదరావుపల్లి రెవెన్యూ గ్రామాన్ని రెండు భాగాలుగా విడదీశారని ఆ వినతిపత్రంలో తెలిపారు. కొంత భాగాన్ని ఎస్.కోట తాలుకాలో, కొంత భాగాన్ని భీమునిపట్నం తాలుకా పద్మనాభం మండలం కొత్త కొవ్వాడ రెవెన్యూలో వదిలేశారని పేర్కొన్నారు. పెదరావుపల్లి గ్రామాన్ని కొండ పోరంబోకుగా నమోదు చేశారని తెలిపారు. కనీసం గ్రామ కంఠంగా నమోదు చేయలేదని తెలిపారు. పెదరావుపల్లి భూభాగంలో ఎక్కడా కొండలు లేవని, వరి, మామిడి, కొబ్బరి తోటలున్నాయని పేర్కొన్నారు. తమ భూములు అగ్రహారం, ఈనాం భూములని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వేలో కొత్తవలస, పద్మనాభం మండలాల రెవెన్యూ అధికారులు పెదరావుపల్లి గ్రామంలో రీసర్వే చేయాలని కోరారు.